క్లుప్తంగా

చెత్తాచెదారంతో అనారోగ్యం



నేస్తాలమ్మ సతకంపట్టు వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో నేస్తాలమ్మ సతకంపట్టు ప్రదేశంలో చెత్తచెదారం పేరుకుపోవడంతో స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కూంద్రపు కృష్ణంనాయుడు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానియ మీడియాతో మాట్లాడుతూ గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించే నేస్తాలమ్మ సతకంపట్టు ప్రదేశాన్ని పవిత్రంగా కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఆస్పత్రులకు సంబంధించిన మందుల సీసాలు, ఇతర సామగ్రిని ఇక్కడ కుప్పలుగా వేయడంతో దుర్గంధంతోపాటు, తెలియని రోగాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సతకంపట్టు ప్రదేశంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ 97వ వార్డు బర్డ్స్‌కాలనీలో శుక్రవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ రానున్న నాలుగైదు రోజులు విరాళాలు సేకరించి బాధితులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు వై.రాంబాబు, ఎ.అన్నపూర్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఉత్తరాంధ్ర కాపు సంక్షేమ సేవా సంఘం ఏర్పాటు



మాట్లాడుతున్న కన్వీనర్ ముత్యాలు

సింహాచలం: ఉత్తరాంధ్రలో రాజకీయాలకు అతీతంగా కాపు సామాజిక వర్గ అభివృద్ధికి సేవా కార్యక్రమాలు చేయాలన్నదే ఉత్తరాంధ్ర కాపు సంక్షేమ సేవా సంఘం ప్రధాన ఉద్దేశ్యమని సంఘం ఆవిర్భావ కన్వీనర్ జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. సింహాచలంలోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో శుక్రవారం పలువురు కాపు సామాజిక ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర కాపు సంక్షేమ సేవా సంఘంని ప్రకటించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కాపు సామాజిక ప్రతినిధులు హాజరై సంఘ కన్వీనర్‌గా జెర్రిపోతుల ముత్యాలును ఎన్నుకున్నారు. పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఆమోదించారు. ఉత్తరాంధ్రలో సంఘం బలోపేతానికి అన్ని జిల్లాల నుంచి కాపు కుటుంబ సభ్యుల్ని భాగస్వాములను చేయాల ని తీర్మానించారు. రాజకీయాలకి అతీతంగా కాపులకు సహాయ సహకారాలు అందించి, వారి అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. సంఘం ప్రతినిధులు మీసాల సుబ్బన్న, జమ్ము ఆదినారాయణ, ఎన్ని భాస్కరరావు, మాలపు రెడ్డి కోటేశ్వరరావు, ఎస్.మురళీమోహన్, డీఎస్ హెచ్ఎస్ భాను, జెర్రిపోతుల నరసింగరావు, సిరిపురపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓ బొజ్జ గణపయ్య.. తొలిపూజ నీకయ్య

- ఊరూ వాడా వినాయక చవితి సందడి
- వీధి వీధినా మండపాలు, చలువ పందిళ్లు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళ



అడవివరంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కర్రి అప్పలస్వామి



సింహగిరిపై మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వర్తకసంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్



సమావేశంలో పాల్గొన్న సమరసత ఫౌండేషన్ సభ్యులు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న లారస్ ల్యాబ్ ప్రతినిధులు



మార్కెట్లో పూజా సామగ్రి కొనుగోలుదార్ల సందడి

పెందుర్తి: విఘ్నాధిపతి గణనాథుడి పూజలకు నియోజకవర్గం ముస్తాబైంది. వీధివీధిన మండపాలు వెలిశాయి. వీటిలో శనివారం బొజ్జ గణపయ్య కొలువుదీరనున్నాడు. భక్తులకు వరాలు కురిపించేందుకు లంబోదరుడు భువికి దిగిరానున్నాడు. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గంలో శుక్రవారం నుంచే సందడి మొదలయింది. పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రధాన కూడళ్ల వద్ద పూజాసామగ్రి కొనుగోళ్లు భారీ ఎత్తున సాగాయి. జోరు వానలో కూడా ప్రజలు సామగ్రి కొనుగోలు చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలకు మండపాలు, చలువ పందిళ్లు సిద్ధమయ్యాయి.

మట్టి విగ్రహాల పంపిణీ

పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కూడలి వద్ద 300 మట్టి గణపతి విగ్రహాలతో పాటు పూజా సామాగ్రి ఉచితంగా అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్, ప్రతినిధులు సిరిమల్ల గణేష్, కందుల నవీన్, రాజాపు రాజారావు, సునీత పాల్గొన్నారు.

శారదాపీఠంలో..

వినాయక చవితిని పురస్కరించుకుని చినముషిడివాడలోని శారదాపీఠంలో భక్తులకు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పీఠం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

అడవివరం మార్కెట్‌కు చవితి శోభ

సింహాచలం: వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలు చేసే గ్రామస్తులు, మహిళలతో అడవివరం మార్కెట్ శుక్రవారం కిటకిటలాడింది. 93, 98వ వార్డుల్లో వాడవాడలా చవితి సందడి నెలకొంది. బాలాజీనగర్, శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం, గొల్లనారాయణపురం, అడవివరం, సింహపురికాలనీ, పాత అడవివరం, కుమ్మరిదిబ్బ, అప్పన్నపాలెం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వేదికలు ఏర్పాటు చేశారు. సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. పలుచోట్ల శుక్రవారం సాయంత్రానికే వినాయక విగ్రహాలను వేదికల వద్దకు చేర్చారు. శనివారం కలశ ప్రతిష్ట చేసి విగ్రహాలను దర్శనానికి అందుబాటులో ఉంచనున్నారు.

– అడవివరంలో వాడవాడలా శుక్రవారం మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ భవనం వద్ద 500 మట్టి గణపతి విగ్రహాలు, పూజాసామగ్రి, వినాయక వ్రతకల్పం పుస్తకం, పాలవెల్లి ఉచితంగా అందించారు. మట్టి వినాయకుడినే ప్రతి ఒక్కరూ పూజించాలని, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కర్రి సత్తిబాబు, బోర ప్రసాదరెడ్డి, మజ్జి ధర్మ, లండ రమణ, అక్కిరెడ్డి అప్పారావు, సిరిపురపు కృష్ణ, సిగడం తాతబాబు, కంపర గణేష్, జి.నాగరాజు పాల్గొన్నారు.

సింహగిరి వర్తక సంఘం ఆధ్వర్యంలో....

సింహగిరిపై సింహగిరి వర్తక సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగింది. మార్కెట్‌లో ఉన్న వర్తకులకు, వర్కర్లకు, భక్తులకు వర్తకసంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ మట్టి గణపతులను ఉచితంగా అందించారు. వర్తకసంఘం ఉపాధ్యక్షుడు సానబోయిన పైడిరాజు, కోశాధికారి దొంతల శంకర్, సభ్యులు బంటుబిల్లి సురేష్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా చవితి ఉత్సవాలు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించుకోవాలని ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి సూచించారు. పరవాడ సినిమాహాలు కూడలి వద్దనున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వినాయక మండపాల వద్ద భజన, సామూహిక హారతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హిందూ ధర్మం కోసం అందరు కలిసి పనిచేయాలన్నారు. అక్టోబరు 2న గ్రామ కమిటీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు నాగ పేర్రాజు, వై.సునీత, రాంబాబు, రాము, సత్తిబాబు, మంగరాజు, విజయ, సన్యాసిరావు, పరవాడ ఖండం ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు.

పరవాడ: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని పరవాడ పరిసర గ్రామాల ప్రజలకు ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్ యాజమాన్యం మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేసింది. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు 20 వేల విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. పరవాడ, సినిమాహాలు కూడలి, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, గొర్లివానిపాలెం, లంకెలపాలెం, ఫార్మాసిటీ కాలనీ, కూర్మన్నపాలెం, అచ్యుతాపురం ప్రాంతాల్లో పరిశ్రమ ఉద్యోగులతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయించింది. చేపట్టింది. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు చావా రామకృష్ణ, పిల్లా జగదీష్, చుక్క రవికుమార్, హరి, జాన్, రామారావు, నిఖిల్ పాల్గొన్నారు.

సబ్బవరం: పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ చవితి వేడుకలను చేసుకోవాలని పీవీఆర్ ప్రాపర్టీస్, ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు కోరుతూ 5 వేల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పూజా పుస్తకాలను కూడా అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పీవీఆర్ గుప్తా, రాజు తదితరులు పాల్గొన్నారు.

– స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థులు తయారు చేసిన వినాయక మట్టి ప్రతిమలను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురుకులంలోని క్రాఫ్ట్ టీచర్ నానాజీ అధ్వర్యంలో విద్యార్థులు ఈ ప్రతిమలను తయారు చేశఋారు. సమాజం పట్ల బాధ్యత ఉన్న ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలతోనే చవితి వేడుకలను చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ కోరారు. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం–భావితరాలకు మంచి భవిష్యత్తును ఇద్దాం.. అనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు టి.రాంబాబు, కె.చిరంజీవి, రఘురామనాయుడు, జానకిరామ్, తిరుపతిరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



అడవివరం మార్కెట్‌లో పూజాసామగ్రి కొనుగోళ్ల సందడి



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న పీవీఆర్ ప్రాపర్టీస్, ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సభ్యులు



మట్టి గణపతి విగ్రహాలను ప్రదర్శిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు



పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో పూజా సామగ్రి అమ్మకాలు



పెందుర్తి కూడలి వద్ద మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు



శారదాపీఠంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న పీఠం ప్రతినిధులు

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పి.రమణ

సబ్బవరం: మండలంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేసి, విగ్రహాలు కొలువుదీర్చేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సబ్బవరం సీఐ పి.రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ చిన్న, పెద్ద ఎలాంటి విగ్రహం పెట్టినా ప్రతి మండపానికి అనుమతి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులో ఉందన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో రాత్రి పూట నిర్వాహకులు కనీసం ఒకరైనా మండపంలో కాపలాగా పడుకోవాలన్నారు. గ్రామంలో ఏ విధమైన తగాదాల్లేకుండా కమిటీలు ఏర్పాటు చేసుకుని, సంప్రదాయబద్దంగా చవితి వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు, మైక్‌లను పరిమితికి మించి సౌండ్ వచ్చేలా వినియోగించవద్దన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీలత లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

న్యాయ విద్యార్థులు సామాజిక బాధ్యతను గుర్తెరగాలి



రణభీర్ సింగ్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

సబ్బవరం: భారత స్వాతంత్రోద్యమం నాటి బ్రిటీష్ దురాగతాలతో పాటు సామాజిక నిబంధనల్ని సవాల్ చేయడంలో న్యాయవాదులు ముందున్నారని నల్సార్(ఎన్ఎల్‌యూ) ఢిల్లీ న్యాయ విశ్వవిద్యాలయాల వ్యవస్థాపక ఉపకులపతి ఆచార్య రణభీర్ సింగ్ అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో లీగల్ ఎడ్యుకేషన్–సమకాలీన సమస్యలు, సవాళ్లు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ప్రస్తుత విద్యార్థులు సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించడం కంటే తమ వ్యక్తిగత లబ్ధత కోసమే ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు సామాజిక బాధ్యత తెలుసుకుని ఎదగాలని సూచించారు. మరో అతిథి ఎన్ఎల్ఎస్ఐయూ బెంగళూర్ పూర్వ ఉపకులపతి ఆచార్య మోహన్ గోపాల్ మాట్లాడుతూ న్యాయ విద్య సమాజంలోని వివిధ దృక్కోణాలపై లోతైన అవగాహన పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆచార్య మృణాల్ సతీష్, దామోదరం సంజీవయ్య యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు, అకడమిక్ డీన్ డాక్టర్ సోమా భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ముంపు బాధితులకు నిత్యావసర సరకుల వితరణ



సరకులు అందిస్తున్న సబ్బవరపు నారాయణమూర్తి

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు ఒమ్మివానిపాలెంలో భారీ వర్షానికి పూరిళ్లు నీట మునిగి, నష్టపోయిన రెండు కుటుంబాలకు గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్‌తో కలిసి శుక్రవారం నిత్యావసర సరుకులు అందించారు. ముంపునకు గురైన గొంప ముత్యాలు, గొంప రమణ ఇళ్లను పరిశీలించారు. ఆ రెండు కుటుంబాలకు అవసరమైన బియ్యం బస్తాలు, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, టమాటా తదితర సరకులను అందించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు ఒమ్మి కోటి, కాయితి గంగరాజు, శ్రవణ్, వార్డు మెంబర్ జక్కాన శ్రీను తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



మృతి చెందిన రాములమ్మ

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెంలో పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతిచెందింది. వివరాలు. గ్రామానికి చెందిన వంగలిపైడి రాములమ్మ(56) శుక్రవారం కూలిపనుల్లో భాగంగా స్థానిక రాయపురాజు చెరువు సమీపంలో వరి నాట్లు వేసేందుకు వెళ్లింది. నాట్లు వేస్తుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే కుప్పకూలి మరణించింది. మృతురాలి భర్త శ్రీరాములు పోస్ట్‌మేన్‌గా పనిచేస్తూ గతంలో మరణించాడు. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ముగ్గురుకీ వివాహాలు అయిపోయాయి. డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ ఘటనా స్థలానికి వెళ్లి, వివరాలను తెలుసుకున్నారు.

'వరద బాధితులకు ఆసరాగా నిలుద్దాం'



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: విజయవాడలో వరదల్లో చిక్కుకున్న బాధితులకు చేయూతనందించేందుకు ప్రజలు ముందుకు రావాలని మల్కాపురం సీపీఐ నాయకులు కోరారు. వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఐ శుక్రవారం పారిశ్రామిక ప్రాంతంలో విరాళాల సేకరణ చేపట్టింది. బాధితులకు ఆసరా ఇచ్చేందుకు ప్రతీ ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని కోరారు. సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ ఎంతో మంది తిండి, నీరు లేక ఇబ్బంది పడుతున్నారని, మనమంతా వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు..

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కన్నెర్ర

- భూ కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు
- తహసీల్దార్ వేణుగోపాల్ హెచ్చరిక



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

పెందుర్తి: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి విక్రయాలు జరుపుతున్న బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని పెందుర్తి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ సూచించారు. కబ్జాలు చేసిన స్థలాలను కొంటే ఆర్థికంగా తీవ్ర నష్టాల పాలవుతారని హెచ్చరించారు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని టీచర్స్ లేఅవుట్‌కి ఆనుకుని ఉన్న సర్వే నెం.185 ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమణలపై తహసీల్దార్ కన్నెర్రజేశారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను తక్కువ ధరలకు వస్తాయని కాయకష్టం చేసుకున్న డబ్బులతో కొనుగోలు చేస్తే తరువాత తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. నిజంగా ఇంటి స్థలానికి అర్హత ఉన్నవారైతే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. పేదల ముసుగులో ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తే సహించబోమన్నారు. ప్రభుత్వ భూములు క్రయ విక్రయాలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఆక్రమణల తొలగింపులో ఆర్ఐ సాయి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.